శభాష్ శరణ్య

37వ అండర్-13 గర్ల్స్ చాంపియన్‌గా నిలిచిన తెలంగాణ బాలిక

హైదరాబాద్, ఆట ప్రతినిధి: అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న తెలంగాణ చదరంగ క్రీడాకారుల జాబితాలో మరో చాంపియన్ అవతరించింది. రాష్ట్రానికి చెందిన శరణ్య దేవి నరహరి.. 37వ జాతీయ అండర్-13 గర్ల్స్ చెస్ చాంపియన్‌షిప్-2024 టైటిల్‌ను సొంతం చేసుకుంది. పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌లో ఈనెల 17 నుంచి 24 వరకు జరిగిన ఈ టోర్నీలో శరణ్య.. 11 రౌండ్లలో 9 పాయింట్లు సాధించి సత్తా చాటింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఈ టోర్నీలో రెండో స్థానంలో నిలిచిన తమిళనాడుకు చెందిన నివేదిత.. 8.5 పాయింట్లతో శరణ్యకు గట్టిపోటీనిచ్చింది. ఇదే టోర్నీలో తెలంగాణకు చెందిన దీక్షిత (8.5 పాయింట్లు), శివాంషిక (8 పాయింట్లు) వరుసగా 6,7వ స్థానాల్లో నిలవడం విశేషం.

మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, వెంకట దత్తసాయి రిసెప్షన్ వేడుకకు హాజరైన మాజీ మంత్రి హరీశ్ రావు

ఇదేం పద్ధతి?

ముదురుతున్న మను భాకర్.. ఖేల్‌రత్న వివాదం

క్రీడా మంత్రిత్వ శాఖ తీరుపై కోచ్ జస్‌పాల్ రాణా అసంతృప్తి

ఢిల్లీ: భారత ఒలింపిక్ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించి సరికొత్త రికార్డులు సృష్టించిన యువ షూటర్ మను భాకర్ పేరును కేంద్ర అత్యున్నత పురస్కారమైన 'ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న'కు సిఫారసు చేయలేదన్న వివాదం నానాటికీ ముదురుతోంది. దీనిపై మను కోచ్ జస్‌పాల్ రాణా స్పందిస్తూ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. 'ఖేల్‌రత్నకు మను దరఖాస్తు చేసుకోలేదని వాళ్లు ఎలా చెబుతారు? ఒలింపిక్స్ ఒకే ఎడిషన్‌లో రెండు పతకాలు సాధించి ఆమె చరిత్ర సృష్టించింది. దరఖాస్తు చేయకున్నా ఆమె పేరు జాబితాలో ఉండాలి. ఒక అగ్రశ్రేణి క్రీడాకారిణి తనకు అవార్డు కావాలని ఎందుకు దరఖాస్తు చేయాలి? అక్కడున్నవారికి మను ఎవరో? దేశం కోసం ఏం సాధించిందో తెలియదా? అత్యున్నత స్థాయిలో అద్భుత ప్రదర్శన చేసిన క్రీడాకారులకు అవార్డులను అందజేయాలి. వాళ్లను ఎలా మరిచిపోతారు? ఒక అథ్లెట్‌ను ఇలా ట్రీట్ చేయడం ఆమె పురోగతిని అడ్డుకోవడమే' అని అసహనం వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి 23న దాయాదుల పోరు

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదల ● ఫిబ్రవరి 19 నుంచి టోర్నీ మొదలు ● మార్చి 9న ఫైనల్

దుబాయ్: ప్రపంచ క్రికెట్ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ నిరీక్షణకు తెరపడింది. ఈ టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ ఎట్టకేలకు విడుదల చేసింది. తీవ్ర తర్జనభర్జనలు, చర్చోపచర్చల అనంతరం హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించనున్న ఈ మెగా టోర్నీని వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలలో పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా జరిపించేందుకు ఐసీసీ ముహూర్తం ఖరారు చేసింది. 8 జట్లు రెండు గ్రూపులుగా విడిపోయి తలపడనున్న ఈ టోర్నీలో తొలి మ్యాచ్ ఫిబ్రవరి 19న ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య జరుగనుంది. ఇక హైఓల్టేజ్ మ్యాచ్ అయిన భారత్, పాకిస్థాన్ పోరుకు ఫిబ్రవరి 23న దుబాయ్ ఆతిథ్యమివ్వనుంది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న పాక్.. గ్రూప్ దశలో తమ మ్యాచ్‌లను కరాచీ, దుబాయ్, రావల్పిండిలలో ఆడనుంది.

గ్రూప్ దశలో ప్రతి జట్టు తమ గ్రూపులోని మిగిలిన జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడనుంది. మార్చి 2 దాకా గ్రూప్ దశ మ్యాచ్‌లు.. 4, 5 తేదీలలో రెండు సెమీస్‌లు జరుగనుండగా మార్చి 9న ఫైనల్ (మొత్తం 15 మ్యాచ్‌లు) జరుగుతుంది. భారత్ ఆడే మ్యాచ్‌లకు దుబాయ్ ఆతిథ్యమివ్వనుండగా పాక్‌లో జరుగబోయే మ్యాచ్‌లను కరాచీ, లాహోర్, రావల్పిండిలో నిర్వహిస్తారు. ఒకవేళ భారత్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే ఫైనల్‌ను దుబాయ్‌లో నిర్వహించనున్నారు. లేకుంటే టైటిల్ పోరుకు లాహోర్ ఆతిథ్యమివ్వనుంది. రెండు సెమీస్‌లతో పాటు ఫైనల్‌కూ రిజర్వ్ డే ఉంది.

గ్రూప్ ఏ
పాకిస్థాన్, భారత్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్

గ్రూప్ బీ
దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, అఫ్గానిస్థాన్, ఇంగ్లండ్

భారత మ్యాచ్‌ల షెడ్యూల్

ఫిబ్రవరి 20	భారత్ X బంగ్లాదేశ్	దుబాయ్
ఫిబ్రవరి 23	భారత్ X పాకిస్థాన్	దుబాయ్
మార్చి 01:	భారత్ X న్యూజిలాండ్	దుబాయ్

భారత్‌దే వన్డే సిరీస్

హర్లీన్ డియోల్ శతకం ● రాణించిన స్మృతి మంధాన, ప్రతీకా

వడోదర: స్వదేశంలో వెస్టిండీస్‌తో జరుగుతున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా మరో మ్యాచ్ మిగిలుండగానే భారత మహిళల జట్టు 2-0తో ఆధిక్యంలో నిలిచింది. మంగళవారం వడోదర వేదికగా జరిగిన రెండో వన్డేలో టీమ్ ఇండియా 115 పరుగుల తేడాతో విజయదుందుభి మోగించింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన హర్మన్‌ప్రీత్ సేన.. నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 358 పరుగుల భారీ స్కోరు చేసింది. వన్ డౌన్ బ్యాటర్ హర్లీన్ డియోల్ (103 బంతుల్లో 115, 16 ఫోర్లు) అంతర్జాతీయ కెరీర్‌లో తొలి శతకం సాధించగా ఓపెనర్ ప్రతీకా రావల్ (86 బంతుల్లో 76, 10 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (47 బంతుల్లో 53, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), జెమీమా రోడ్రిగ్స్ (36 బంతుల్లో 52, 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో మెరిశారు. అనంతరం ఛేదనలో విండీస్.. 46.2 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌట్ అయింది. సారథి హీలి మాథ్యూస్ (109 బంతుల్లో 106, 13 ఫోర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడినా ఆమెకు సహకారం అందించేవారెవరూ లేకపోవడంతో వెస్టిండీస్‌కు పరాభవం తప్పలేదు. హర్లీన్ డియోల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య మూడో వన్డే ఈనెల 27న ఇదే వేదికపై జరుగుతుంది.

మెరిసిన టాపార్డర్

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్ నమ్మకాన్ని భారత టాపార్డర్ వమ్ము చేయలేదు. మంధాన, ప్రతీకా తొలి వికెట్‌కు శతక (110) భాగస్వామ్యం నెలకొల్పి బలమైన పునాది వేశారు. దూకుడుగా ఆడిన మంధాన.. వరుసగా ఆరో (వన్డేలలో 29వ) అర్ధ శతకాన్ని పూర్తిచేసింది. మరో ఎండ్‌లో ప్రతీక సైతం తొలి హాఫ్ సెంచరీని నమోదుచేసింది. దురదృష్టవశాత్తూ మంధాన రనౌట్‌గా వెనుదిరిగినా ఆమె స్థానంలో వచ్చిన హర్లీన్ ఆరంభంలో ఆచితూచి ఆడింది. 62 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేసిన ఆమె ఆ తర్వాత జోరు పెంచింది. డాటిన్ వేసిన ఇన్నింగ్స్ 45వ ఓవర్లో 3 ఫోర్లు బాది సెంచరీకి చేరువైన ఆమె.. కనెల్ 47వ ఓవర్లో బౌండరీతో సెంచరీ సాధించింది. ఆఖర్లో జెమీమా కూడా బ్యాట్ ఝుళిపించడంతో భారత్ భారీ స్కోరు చేసింది. వన్డేలలో 350 ప్లస్ స్కోరు చేయడం భారత్‌కు ఇది రెండోసారి.

విండీస్ తడబాటు

భారీ ఛేదనలో విండీస్ ఆరంభం నుంచి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ఒక ఎండ్‌లో మాథ్యూస్ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నప్పటికీ జోసెఫ్ (15), క్రాఫ్టన్ (13), విలియమ్స్ (0), డాటిన్ (10) ఆమెకు అండగా నిలవకలేకపోయారు. క్యాంప్‌బెల్ (38) ఫర్వాలేదనిపించింది. భారత బౌలర్లలో ప్రియా మిశ్రా (3/49), ప్రతీక (2/37), దీప్తి శర్మ (2/40) విండీస్‌ను నిలువరించారు.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 358/5 (హర్లీన్ 115, ప్రతీక 76, జోసెఫ్ 1/27, ఫ్లెచర్ 1/38); **వెస్టిండీస్:** 46.2 ఓవర్లలో 243/10 (మాథ్యూస్ 106, క్యాంప్‌బెల్ 38, ప్రియా 3/49, ప్రతీక 2/37)

హర్లీన్ (115)

హెచ్‌సీఏ కార్యాలయంపై విజిలెన్స్ దాడులు

హైదరాబాద్, డిసెంబర్ (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కార్యాలయంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. హెచ్‌సీఏలో అక్రమాలు జరుగుతున్నాయంటూ సెప్టెంబర్ 18న భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు సోదాలు చేశారు. టెండర్ల విషయంలో వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయడానికి సంబంధిత రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఉప్పల్ స్టేడియంలో నిర్వహించే అంతర్జాతీయ మ్యాచ్‌లకు రవాణా, క్యాటరింగ్ కాంట్రాక్టులు ఇవ్వడంలో కొందరు హెచ్‌సీఏ సభ్యులు అవకతవకలకు పాల్పడ్డట్లు కిరణ్‌కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. ఈమేరకు సంబంధిత దస్త్రాలను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రఘు, దేవికాకు టైటిల్స్

బెంగళూరు: 86వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ టోర్నీలో కర్నాటకకు చెందిన రఘు, హర్యానా యువ సంచలనం దేవికా సిహాగ్ తమ విభాగాలలో టైటిల్స్ దక్కించుకున్నారు. మంగళవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్‌లో రఘు.. 14-21, 21-14, 24-22తో మాజీ చాంపియన్ మిథున్ మంజునాథ్‌ను చిత్తు చేసి టైటిల్ కైవసం చేసుకున్నాడు. మహిళల ఫైనల్‌లో దేవికా.. 21-15, 21-16తో శ్రీయాన్షి వలిషెట్టిని ఓడించింది.

ప్రపంచకప్‌నకు భారత జట్టు ప్రకటన

తెలంగాణ క్రికెటర్లు త్రిష, ధృతికి చోటు

ఢిల్లీ: వచ్చే ఏడాది కౌలాలంపూర్ (మలేషియా) వేదికగా జరగాల్సి ఉన్న ఐసీసీ అండర్-19 మహిళల ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మహిళా సెలక్షన్ కమిటీ మంగళవారం 15 మందితో కూడిన జట్టును ప్రకటించింది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగనున్న టీమ్‌ఇండియాకు నిక్కీ ప్రసాద్ సారథిగా వ్యవహరించనుండగా సానికా చాక్లేను వైస్ కెప్టెన్‌గా నియమించారు. 15 మంది జట్టు సభ్యులలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు అమ్మాయిలు చోటు దక్కించుకున్నారు. తెలంగాణకు చెందిన గొంగడి త్రిష, కేసరి ధృతికి జట్టులో స్థానం లభించగా విశాఖపట్నం అమ్మాయి ఎండీ షబ్నమ్ సైతం చోటు సంపాదించింది. 16 జట్లు పాల్గొనబోయే ఈ మెగా టోర్నీలో భారత్.. జనవరి 19న వెస్టిండీస్‌తో జరుగబోయే మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభించనుంది.

భారత జట్టు:
నిక్కీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాక్లే (వైస్ కెప్టెన్), జి. త్రిష, కమిలిని (వికెట్ కీపర్), భవిక అహిరె (వికెట్ కీపర్), ఈశ్వరి అవసరె, మిథిలా వినోద్, జోషిత, సోనమ్ యాదవ్, పరునికా సిసోడియా, కేసరి ధృతి, అయూషి శుక్లా, ఆనందిత కిషోర్, ఎండీ షబ్నమ్, ఎస్. వైష్ణవి **స్టాండ్ బై ప్లేయర్లు:** ఎస్.నంధన, జె. ఇరా, టి. ఆనంది

నిలకడగా కాంబ్లి ఆరోగ్యం

ముంబై: మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లి ఆరోగ్యం నిలకడగా ఉంది. మూత్రనాళాల ఇన్‌ఫెక్షన్, మెదడులో రక్తం గడ్డ కట్టడంతో రెండ్రోజుల క్రితం దవాఖానలో చేరిన కాంబ్లి వైద్యానికి స్పందిస్తున్నారని వైద్యులు తెలిపారు. ఇన్‌ఫెక్షన్‌ను తొలగించామని, అయినా మరో 24 గంటల వరకూ ఆయనను వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతామని డాక్టర్ త్రివేది చెప్పారు.

29 ఈ-సేవా కేంద్రాలు ప్రారంభం

హైకోర్టు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే

హైదరాబాద్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): న్యాయవ్యవస్థను డిజిటలైజ్ చేయడంతోపాటు న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో కొత్తగా మరో 29 ఈ-సేవా కేంద్రాలు ఏర్పాటయ్యాయి. వాటిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన హైకోర్టు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

బీచుపల్లి నుంచి గద్వాల కలెక్టరేట్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్తున్న గురుకుల విద్యార్థులు

18 కిలోమీటర్ల నిరసనయాత్ర

- **ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని గురుకుల విద్యార్థుల పోరుబాట**
- **మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని, కొడుతున్నారని ఆగ్రహం**
- **గద్వాల కలెక్టరేట్‌కు తరలిన విద్యార్థులు**
- **చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్**

గద్వాల, డిసెంబర్ 24 : ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురుకుల విద్యార్థులు రోడ్డెక్కారు. మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా బీచుపల్లిలోని పాఠశాల విద్యార్థులు 150 మంది 18 కిలోమీటర్లు పాదయాత్రగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కు చేరుకున్నారు. కలెక్టర్‌ను కలిసేందుకు విద్యార్థులు రావడంతో కార్యాలయ గేటుకు తాళం వేయడంతో గేటు బయటే బైఠాయించారు. అనంతరం హాల్‌లో రెండు గంటలకు పైగా వెయిట్ చేయించారు. చివరికి 10 మంది విద్యార్థులను తన చాంబర్‌లోకి కలెక్టర్ పిలిపించుకొని మాట్లాడారు. గురుకుల ప్రిన్సిపాల్ వెంకటేశ్ తమను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని, మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదని విద్యార్థులు వివరించారు. గతంలో రెండుసార్లు సస్పెండ్ అయిన ప్రిన్సిపాల్‌ను కేటాయించారని వాపోయారు. తమను దూషించడంతో పాటు అకారణంగా చేయి చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతడి వేధింపులతో చాలా మంది టీసీలు తీసుకొని వెళ్లిపోయారని తెలిపారు. ఖాళీ అయిన సీట్లను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ చెప్పడంతో విద్యార్థులు శాంతించారు. వీరిని ప్రత్యేక బస్సులో బీచుపల్లి గురుకులానికి తరలించారు.

బాత్‌రూంలేక బయటకెళ్తున్నాం

గురుకులంలో విద్యార్థులకు అవసరమైన డార్మెంటరీలు లేవు. 5వ తరగతి పిల్లలు రాత్రి పూట గుట్టపైకి వెళ్తున్నారు. విషసర్పాలు కాటేస్తే ఎవరు బాధ్యత వహిస్తారు? సమస్యలు పరిష్కరించడం లేదనే కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేయాల్సి వచ్చింది. ఒకనాడు బీచుపల్లి గురుకులం రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండేది. నేడు సమస్యలకు కేరాఫ్‌గా మారింది. – **కేశవరెడ్డి, ఇంటర్ విద్యార్థి**

బూతులు తిట్టి టీసీలు ఇస్తుండ్రు

విద్యార్థులు స్టడీ అవర్స్‌లో వాష్‌రూంకు వెళ్లినా నానా బూతులు తిడుతున్నారు. నీళ్లు తాగేందుకు వెళ్తే తిడుతున్నారు. తల్లిదండ్రులను కలవనీయడం లేదు. టీసీలు ఇచ్చి పంపుతుండ్రు. గురుకులంలో వసతులు లేవు. విద్యార్థుల పడుతున్న అవస్థలను ఎవరూ పట్టించుకోవడం లేదు. సీనియర్లకు ప్రాక్టికల్స్ నిర్వహించలేదు. ఈ ప్రిన్సిపాల్ మాకొద్దు.. – **భరత్‌సింహ, ఇంటర్ విద్యార్థి**

ప్రభుత్వ ఆదేశాలతో భూ విచారణ

'కూలికి వెళ్లడమే నేరమా'పై 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నల్లబెల్లి, డిసెంబర్ 24 : వివాదంలో ఉన్న భూమికి సంబంధించి విచారణ చేపట్టాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద మంగళవారం రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెంకు చెందిన వక్కల వెంకటేశ్‌కు అదే గ్రామానికి చెందిన తౌట్‌శెట్టి రాజిరెడ్డికి మధ్య భూ వివాదం ఉండగా వారిద్దరూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ నెల 18న వక్కల వెంకటేశ్ గ్రామపంచాయతీ అనుమతితో తన భూమిలో గుగులోత్ రాజు, రవి అనే ఇద్దరు కూలీలతో చెట్లు, ముళ్ల పొదలను తొలగించారు. దీనిపై రాజిరెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన ఎస్సై గోవర్ధన్ కూలీలపై చేయి చేసుకోగా సదరు కూలీలు పోలీసులపై నేషనల్ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు ఈ నెల 24న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'కూలికి వెళ్లడమే నేరమా'.. అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. తహసీల్దార్ ముప్పు కృష్ణతో పాటు ఆర్ఐ కార్తీక్ విచారణ చేపట్టారు. విచారణలో తౌట్‌శెట్టి రాజిరెడ్డి తప్పుడు ధ్రువపత్రాలతో పోలీసులను తప్పుదోవ పట్టించినట్టు గుర్తించారు. సర్వే నంబర్ 10/బీలోని 23 గుంటల భూమి వక్కల వెంకటేశ్‌కు చెందినదిగా పేర్కొన్నారు. విచారణకు సంబంధించిన రికార్డును కలెక్టర్‌కు ఇవ్వనున్నట్టు తహసీల్దార్ తెలిపారు. పోలీసులను తప్పుదోవ పట్టించిన వ్యక్తిపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం రుద్రగూడెంలో భూ విచారణ చేపడుతున్న ఆర్ఐ కార్తీక్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.